ప్రణాళికాబద్ధంగా నల్లగొండ అభివృద్ధి

● నేడు మాస్టర్ ప్లాన్ విడుదల ● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నీలగిరి, జనవరి 25 : నల్లగొండ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు పక్కాగా మాస్టర్ ప్లాన్‌ను తయారు చేశామని, గణతంత్ర దినోత్సవం సందర్భంగా దానికి సంబంధించిన జీఓను విడుదల చేయనున్నట్లు రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగిసిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో నల్లగొండ కూడా ఉందన్నారు. ఎప్పుడో చేసిన మాస్టర్‌ప్లాన్ వల్ల అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని వాటన్నింటినీ అధిగమించి అందరికీ ఉపయోగపడేలా కొత్త మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి : కౌన్సిలర్ భవాని

బీఆర్ఎస్ కౌన్సిలర్ మారగోని భవాణీగణేశ్ మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధితో ప్రపంచంలోనే నల్లగొండకు గుర్తింపు వచ్చిందన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ పానగల్‌ను పర్యాటక ప్రాంతంగా చేసేందుకు వచ్చిన నిధులను అక్కడే ఖర్చు చేయాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లను మంత్రి శాలువాతో సత్కరించి మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, పిల్లి రామరాజు, ఆలకుంట్ల రాజశ్వేరీమోహన్‌బాబు, ఫర్హత్ ఫర్జానా ఇబ్రహీం ఉన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

నల్లగొండ పట్టణంలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. బీట్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన 11/33కేవీ సబ్‌స్టేషన్, ఫుడ్‌మార్కెట్, మున్సిపల్ కౌన్సిల్ హాల్, బీటీఎస్‌లోని అంబేద్కర్‌భవన్‌లో అదనపు గదులను, కలెక్టరేట్‌లో మహిళాశక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఈ బాలస్వామి అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండలో ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ మౌనిక

నల్లగొండ, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని దానిని విధిగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదని దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. అనంతరం ఓటు హక్కును విధిగా నమోదు చేసుకోవడంతో పాటు తప్పనిసరిగా వినియోగించుకుంటామని సమావేశానికి హాజరైన వారితో ప్రమాణం చేయించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఓటరు దినోత్సవం

నీలగిరి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో అధికారులు, పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బంది చేత ఎస్‌బీ డీఎస్పీ రమేశ్ ప్రతిజ్ఞ చేయించారు. మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తన కార్యాలయంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. దేవరకొండలో నిర్వహించిన అవగాహ ర్యాలీలో ఏఎస్పీ మౌనిక పాల్గొన్నారు.

ఖైదీలు మంచి ప్రవర్తన కలిగిన పౌరులుగా మారాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నాగరాజు

నీలగిరి, జనవరి 25: జైలు మానసిక స్థితిని మార్చే ఆశ్రమమని, ఖైదీలు వారికి కల్పించిన హక్కులను ఉపయోగించుకొని మంచి ప్రవర్తన కలిగిన పౌరులుగా మారాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. శనివారం జిల్లా జైలులో ఖైదీల హక్కులపై జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది క్షణికావేశంలో చేసిన తప్పులకు శిక్షలు అనుభవిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక తప్పు చేస్తుంటారని వాటిని సరి దిద్దుకొని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఖైదీల హక్కులు, విధులపై వివరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.దుర్గాప్రసాద్, న్యాయసేవాసంస్థ కార్యదర్శి బి.దీప్తి, జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్, జైలర్ సీహెచ్ బాలకృష్ణ, డిప్యూటీ జైలర్లు ఎం.నరేశ్, వై.వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాదులు నిమ్మల భీమార్జున్‌రెడ్డి, లెనిన్ బాబు, టీవీ ప్రసాద్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన నాయకులు

మాజీ సీఎం కేసీఆర్‌తో నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

మర్రిగూడ(నాంపల్లి), జనవరి 25 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను శనివారం రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఫిబ్రవరి 5న జరిగే తన కుమారుడి వివాహానికి రావాలని కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు కంకణాల వెంకట్‌రెడ్డి తెలిపారు.

బీడబ్ల్యూఎఫ్ కోచింగ్ ప్రోగ్రాంకు రామకృష్ణ ఎంపిక

రామకృష్ణను అభినందిస్తున్న గోపీచంద్

మిర్యాలగూడ, జనవరి 25: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే బీడబ్ల్యూఎఫ్(బ్యాడ్మింటన్ వరల్డ్ ఫౌండేషన్) లెవల్ వన్ కోచర్స్ కోర్స్‌కు పట్టణానికి చెందిన కోచ్ ఎం.రామకృష్ణ ఎంపికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎంపికకు కృషి చేసిన పుల్లెంల గోపీచంద్‌ను రామకృష్ణ హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీడబ్ల్యూఎఫ్ కు ఎంపికైన రామకృష్ణను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.ప్రశాంత్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ జి.అంజయ్య, జిల్లా సెక్రటరీ పి.నవీన్ అభినందించారు.

రంగశాయిరెడ్డి కుటుంబానికి గుత్తా పరామర్శ

రంగసాయిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నిడమనూరు, జనవరి 25 : మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు యడవల్లి రంగశాయిరెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తుమ్మడం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగశాయిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు ముంగి శివమారయ్య, మేరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, యడవల్లి నరేందర్‌రెడ్డి, మంజులా సీతారాములు ఉన్నారు.

హాలియాకు చెందిన బీసీ నాయకుడు కోనాల శివయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారి ఇంటికివెళ్లి శివయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నకిరేకల్, జనవరి 25 : నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన వంగూరి ఎల్లయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారి ఇంటికి వెళ్లి ఎల్లయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి నాయనమ్మ ఇటీవల మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి గొరెంకలపల్లికి వెళ్లి ఆయనను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ సర్పంచ్ చెట్టిపల్లి జానయ్య, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకట్, నాయకులు ఉన్నారు.

చిట్యాల : బీఆర్ఎస్ నాయకుడు కోనేటి ఎల్లయ్య తల్లి ఎల్లమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి వారి ఇంటికి వెళ్లి ఎల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

చిట్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వేముల వీరేశం

మున్సిపల్ కౌన్సిల్ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, జనవరి 25 : చిట్యాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో అమృత్ 2.0 కింద మంజూరైన రూ.12.5 కోట్లతో నిర్మించనున్న మంచినీటి ట్యాంక్, రూ.20 లక్షలతో నిర్మించనున్న వైకుంఠధామం ప్రహరీ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు.

మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

చిట్యాల మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ కాలం ఈ నెల 26తో ముగియనుండటంతో శనివారం వారికి వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని వారిని సన్మానించి మెమొంటోలు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తన పదవీ కాలంలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు. ఎన్నో ఏండ్లుగా పరిష్కారానికి నోచని సమస్యలను తాను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, వెల్మినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించం

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జనవరి 25 : ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిని ఏపేక్షించేది లేదని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూములను ప్రజా అవసరాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీదేవి, తాసీల్దార్ నరేందర్‌ను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలిసి మండల కేంద్రంలోని సర్వే నంబర్లు 10,45,78,359తో పాటు 78,359లో ఉన్న భూమిని పరిశీలించారు.

పశుగణనకు సహకరించాలి

పశు వైద్యాధికారి నాగార్జున

పెద్దవూర, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణకు పాడి రైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి నులక నాగార్జున రెడ్డి కోరారు. శనివారం మండలంలోని బట్టుగూడ గ్రామంలో పశుగణన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువుల వివరాలను మండల పశు వైద్యాధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా పశువుల ద్వారా పొందే రుణాలు, పశువుల ఉత్పత్తి, వాటి సంఖ్య అందుబాటులో ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట వెటర్నరీ అసిస్టెంట్ అనిత, గోపాలమిత్ర గాలి లింగారెడ్డి ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● కనగల్ మాజీ ఎంపీపీ కరీంపాషా

మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కరీంపాషా

నల్లగొండ సిటీ, జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండా వారిని మోసం చేసిందని కనగల్ మండల మాజీ ఎంపీపీ కరీంపాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీల పేరుతో ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో చేపట్టే రైతు దీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, మాజీ సర్పంచ్ కడారి కృష్ణయ్య, సీనియర్ నాయకులు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, రమేశ్, కిషన్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ కార్యవర్గం

కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ, జనవరి 25: రోడ్లు భవనాల శాఖలో పని చేస్తున్న మినిస్టీరియల్ ఎంప్లాయిస్ కార్యవర్గాన్ని శనివానం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇమ్మిడి శెట్టి ఉదయ్ కుమార్, కార్యదర్శిగా మహ్మద్ ఇలియాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా నెదునూరు మహేశ్, ఉపాధ్యక్షులుగా ఫణి రాజేశ్, రమేశ్, ట్రెజరర్‌గా అశోక్, మహిళా కార్యదర్శిగా మణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు సన్మానం

కౌన్సిలర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, సబ్ కలెక్టర్

మిర్యాలగూడటౌన్, జనవరి 25: మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిల్ పదవీ కాలం ఆదివారంతో ముగియనున్నది. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 21 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ ఆమోదించింది. ఇందులో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, 15వ ఆర్థికసంఘం నిధులు, మంచినీటి సరఫరా, డంపింగ్‌యార్డు అభివృద్ధికి పరిపపాలనా ఆమోదం తెలిపింది. అనంతరం కౌన్సిలర్లను శాలువాతో సన్మానించారు. అనంతరం స్థానిక ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. పట్టణాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తాసీల్దార్ హరిబాబు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్, డీఈ వెంకన్న, టీపీఎస్ సోమయ్య, మాజీ చైర్ పర్సన్ నాగలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కొండమల్లేపల్లి, జనవరి 25 : రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయా అధికారి జానకిరాములు కోరారు. జనవరి ఒకటో తేదీ నాటికి కొత్తగా పట్టా పాసుబుక్ వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌ను కొండమల్లేపల్లి రైతు వేదికలో ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం

దేవరకొండ రూరల్, జనవరి 25 : మండలంలోని పెంచికల్‌పహాడ్‌లో ఉన్న తుల్చమ్మకుంట చెరువులో శనివారం గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు సీఐ నర్సింహులు తెలిపారు. మృతురాలి వయస్సు 60 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు సెల్ నంబర్ 8712670154, 6304450576ను సంప్రదించాలని సీఐ కోరారు.

పర్యాటక విద్యనభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● ఈమని శివనాగిరెడ్డి

అధ్యాపకులు, విద్యార్థులతో ఈమని శివనాగిరెడ్డి

రామగిరి, జనవరి 25: పర్యాటక విద్యనభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ప్రముఖ పురావస్తు నిపుణుడు, స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నల్లగొండలోని ఎంజీయూలో వర్సిటీ టూరిజంశాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 'సమ్మిళిత అభివృద్ధి కోసం పర్యాటక రంగం థీమ్' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలతో పాటు సుస్థిర అభివృద్ధికి బాటలున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ మారం వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే గ్రామ సభలు

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతిరావు

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

గుర్రంపోడ్, జనవరి 25: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలనే కుట్రతోనే గ్రామ సభల పేరుతో డ్రామాలాడుతున్నదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టేందుకు మాయ మాటలు చెబుతుందే గానీ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ మాయ మాటలకు మరోసారి మోస పోవద్దని సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు కేసాని వెంకట్‌రెడ్డి, మేకల వెంకట్‌రెడ్డి, కామల్ల రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, షేక్ సిరాజ్, ఆవుల కృష్ణ, చంటి, శ్రీనివాసాచారి, మల్లయ్య, మేడి లింగయ్య, రవీందర్‌రెడ్డి, దోటి గణేశ్, యాదగిరి, బాలరాజు, యాదయ్య పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి : తాసీల్దార్ కృష్ణయ్య

మాట్లాడుతున్న తాసీల్దార్ కృష్ణయ్య

నిడమనూరు, జనవరి 25 : చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సరుకులను వినియోగదారులకు సకాలంలో పంపిణీ చేయాలని తాసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. శనివారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరణించిన వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగించేందుకు జాబితాను సమర్పించాలన్నారు. రేషన్ కార్డులో యూనిట్ చేర్పులకు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సందీప్, డీలర్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, డీలర్లు సంఘమేశ్వర్, మదన్‌మోహన్, కందుల సైదమ్మ, వట్టికోటి రవి, కొండారు మట్టయ్య, చిత్రం వెంకటయ్య, కామిశెట్టి సత్యం, గందె శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు

కేతేపల్లి, జనవరి 25 : మండలంలోని భీమారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శనివారం కస్తూరి ఫౌండేషన్ సభ్యులు అందించిన నోటు పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.భిక్షమయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు పరమేశ్, బి.జానకిరెడ్డి, జి.రమేశ్, జి.వెంకటేశ్వర్లు, శివయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

కట్టంగూర్, జనవరి 25 : పీఆర్‌టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్‌ను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంఈఓ అంబటి అంజయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి వెంకటరమణ, సట్టు గోపి, రాష్ట్ర బాధ్యులు రాధాకిషన్, చింతల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డెస్క్ బెంచీల బహూకరణ

గుర్రంపోడ్, జనవరి 25: మండలంలోని నడికుడ జడ్పీ ఉన్నత పాఠశాలకు పది డెస్క్ బెంచీలను గ్రామానికి చెందిన దివంగత వాసా సుదర్శన్ కుమారులు వాసా రాంబాబు, వాసా శ్రవణ్‌కుమార్ శనివారం బహూకరించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ గెలాక్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు క్షేత్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలి

గీతపనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరస్వామి

రామగిరి, జనవరి 25: గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాను తక్షణమే విడుదల చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు చెట్టుపై నుంచి పడిపోతే పాత పద్ధతిలోనే మెడికల్ సర్టిఫికెట్ ద్వారానే పర్మినెంట్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సైదిరెడ్డి, విశ్వనాథుల లెనిన్, పుట్ట మంజుల, విజయ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్'

సభలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శాలిగౌరారం, జనవరి 25 : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్ సాధ్యమని ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వెయ్యి గొంతులు పేరుతో చేపట్టిన రథయాత్ర శుక్రవారం రాత్రి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేయ్యి గొంతులు మహాసభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బకరం శ్రీనివాస్, శ్రీశైలం, బట్ట శ్రీను, తాటిపాముల సైదులు, బట్ట చిన్న సైదులు, లక్ష్మణ్, జానయ్య పాల్గొన్నారు.

ఎంజీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి, జనవరి 25: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 30 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరగాల్సిన వివిధ పీజీ కోర్సులు, ఎంసీఏ, లా పరీక్షలను వాయిదా వేసినట్లు వర్సిటీ సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల 1, 3, 5, 7 సెమిస్టర్స్ పరీక్షలను ఫిబ్రవరి 8 నుంచి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందుకు సందించిన టైంటేబుల్‌ను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్ పంపిణీ

స్పోర్ట్స్ కిట్‌తో విద్యార్థులు

చిట్యాల, జనవరి 25 : లయన్స్ క్లబ్ ఆఫ్ చిట్యాల ఆధ్వర్యంలో శనివారం తాళ్లవెల్లంల ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ మదన్ మోహన్ రేపాల రూ.10వేలతో కిట్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంభయ్య, ఎంజేఎఫ్ ఆమంచి రాజలింగం, జోన్‌చైర్మన్ చిలుకూరి రామకృష్ణ, చిట్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జనగాం రవీందర్, ప్రధాన కార్యదర్శి రేగులగడ్డ నర్సింహ, కోశాధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామసభల్లో 4,114 దరఖాస్తుల స్వీకరణ : ఎంపీడీఓ

మర్రిగూడ, జనవరి 25 : మండలంలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన గ్రామ సభల్లో ప్రజల నుంచి 4,114 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ జీసీ.మునయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇందులో రేషన్ కార్డుల కోసం 2,179, ఇందిరమ్మ ఇండ్లకు 1,503, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 432 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327012-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638